

# వ్యక్తిత్వం

విడిదిలోకి ప్రవేశించగానే, స్నేహితుల మధ్య కూచుని తాను నవ్వుతూ తనవారిని నవ్విస్తూ ఏదో మాట్లాడుతున్న వరుడు శ్యామసుందరం. మాట్లాడడం ఆపి, లేచి నా కెదురువచ్చి 'రండి, రండి' అంటూ నాకు స్వాగతం పలకడం చూసి నా కెంతో ముచ్చటేసింది. అందానికి అందమూ, మాట తీరుకు తోడు మన్ననా తెలిసిన మంచితనమూ ఉన్న అతనిని చూసి, కళ్యాణిచాలా అదృష్టవంతురా లనుకున్నాను.

"రండి మాష్టారూ!" అంటూ కలెక్టరుగా చేస్తున్న శ్యామసుందరం నన్ను తన స్నేహితుల దగ్గరకు తీసుకుపోయి "వీరు కృష్ణమూర్తిగారు కాలేజీలో, అదే, మా మామగారు ప్రిన్సిపాలుగా ఉన్న కాలేజీలోనే ఇంగ్లీషు లెక్చరరుగా పనిచేస్తున్నారు" అంటూ నన్ను పరిచయం చేసాడు నన్ను పరి

కొండముది శ్రీరామచంద్రమూర్తి

పిరిగా కళ్లజోడు తుడుచుకుని "అవును. అది మన డిగ్నిటీకి తగినట్టుగా కూడా ఉంటుంది. అమ్మడితో చెప్పి, పోయి వాళ్లను పిల్చుకురా'' అన్నారు. నాకు వెయ్యి ఏనుగుల బలం వచ్చింది. అడుగులు తడబడే తొందరతో వరుడు విడిదికి వెళ్లాను. విడిదికి అల్లంతదూరం ఇవతలగానే శ్యామసుందరం సీరియస్‌గా ఆలోచిస్తూ పరధ్యానంగా ఉండడం గమనించాను. ఆయన దగ్గర ఇంకా

## వ్యక్తిత్వం

నేనేమీ చెప్పనేలేదు. నన్ను చూడగానే ''ప్రిన్సిపాల్ రాజశేఖరంగారి కూతురు కుమారి కళ్యాణి ఇక్కడికి రా వీలులేదుకదు మాష్టారూ !'' అన్నాడు.

తెల్లబోయాను నేను.

మళ్లీ అతనే అందుకున్నాడు. ''గాభరా పడకండి. అక్కడినుండి ఇప్పుడే వచ్చిన నా ఫ్యామిలీ, మీకన్నా ముందే నాకంతా చెప్పాడు.''

''అది కాదండీ !'' ఏదో సర్ది చెప్పటానికి నా విఫల ప్రయత్నం.

''ఇటు చూడబోతే స్నేహితుల మధ్య చిక్కువడ్డ నా పరువు, అటు ప్రక్కన కాబోయే మామగారి కరుకుతనం, ఈ డైలమా బావుంది కదండీ !''

''మిస్టర్ సుందరం !'' నా గొంతు నాకే క్రొత్తగా ధ్వనిస్తోంది. ''నే చెప్పేది కూడా వినండి. ప్రిన్సిపాలుగారో పార్టీ ఎరేంజ్ చేశారు. మీ స్నేహితులు వెళ్లిపోతుంటే, పార్టీ అన్నా ఇయ్యకపోతే బావుంటుందా చెప్పండి. అక్కడే అమ్మాయిని వాళ్లకు మీరు చూపించవచ్చు.''

''లెక్చరరుగారు మంచి యుక్తే పన్నారు.'' అతని మాటల్లో వ్యంగ్యమూ, కన్నుల్లో ప్రశంసా ద్యోతకమైనాయి. ఇహ నేనక్కడ నుంచోకుండా లోపలకు వెళ్లి జేమ్సునూ, తదితర మిత్రులనూ పార్టీకి ఆహ్వానించి, పెండ్లికొడుకును వెంటబెట్టుకుని, కన్యాదాత గృహానికి తీసుకువచ్చాను.

పార్టీ అంతా అతిథులకు సంతృప్తిగా జరుగుతున్నది. మధ్యలో ప్రిన్సిపాలుగారు లోపలకు వెళ్లి కళ్యాణిని వెంటబెట్టుకుని బయటకు వచ్చారు. కళ్యాణి వదనం మబ్బులు విడిచిన చంద్రుడిలా ఉన్నది. వచ్చి సిగ్గు సిగ్గుగా శ్యామసుందరం కూచున్న సోఫాలోనే ఒకవైపుగా కూర్చున్నది.

జేమ్స్ వారిద్దరినీ చూసి ఎంతో ముచ్చట పడిపోయాడు. అక్కడికక్కడే, వారిద్దరూ సోఫాలో కూచున్న భంగిమునే వో పెన్సిల్ స్కెచ్ వేసి వారికిచ్చాడు. ఆ తర్వాత నవ్వుతూ శ్యామసుందరంతో అన్నాడు.

''చాలా అదృష్టవంతుడివి బ్రదర్ నువ్వు. సరేకాని వధువు పేరేమిటో నేను తెలుసుకోవచ్చునా ?''

శ్యామసుందరం గంభీరంగా జవాబిచ్చాడు. ''నిరభ్యంతరంగానూ, కుమారి కళ్యాణి బి. ఏ.''

రాజశేఖరంగారు ఉలిక్కిపడ్డారు.

జేమ్స్ కూర్చున్న చోటునుంచి లేచి నిలబడి, తన ప్రక్కనే ఉన్న 'పాడ్' లోంచి ఒక చిత్రాన్ని పైకి తీశాడు. దానికింద కళ్యాణీ సుందరానికి ఆశీస్సులతో అని వ్రాశాడు. ఆ బొమ్మలో బ్రహ్మదేముడు తన నాల్గు మొహాలతోనూ సరస్వతిని ముద్దాడబోవడం చిత్రించబడి ఉంది. సరస్వతి అలంకరించుకున్న పైటచెంగును పట్టుకుని,నాల్గు వేదాలూ నల్గురు పసికందుల రూపంలో పాలకై పట్టుబట్టడం కన్పిస్తుంది. సరస్వతిలో కళ్యాణి పోలికలూ, బ్రహ్మలో శ్యామసుందరం పోలికలూ కొట్టవచ్చినట్లున్నాయి.

ఆ చిత్రాన్ని అందుకుని కళ్యాణి ఆనందసరస్వతే అయింది. ఆమెను చూసి శ్యామసుందరం జేమ్స్‌కు అభినందనలు తెల్పడమూ మర్చిపోయాడు.

## 3

లగ్నం పూర్తయింతర్వాత, రెప్పలు కూరుకుపోతూండడంతో, జనానికి కాస్త దూరంగా దొడ్లో వో మూలగా ఉన్న జాజి పందిరి క్రింద మడత మంచం వాల్చుకు పడుకున్నాను. పడుకున్న వెంటనే నాకు తెలీకుండానే నిద్ర పట్టేసింది. ఆ పడుకోవడం, పడుకోవడం, మళ్లీ పొద్దున్న సూర్యుడి నులివెచ్చని కిరణాలు నన్ను జాగరితం చేసేవరకూ



లేవలేదు. అక్కడే దంత ధావనాది కార్యక్రమం పూర్తి చేసుకుని, ముందు హాల్లోకి వచ్చేసరికి, వాతావరణమంతా క్రొత్తగా, గంభీరంగా, ఏదో తెలియని తనంతో నాకే నూత్నమై భీతికరమై కన్పించింది.

సంశయిస్తూ మెల్లగా రాజశేఖరంగారి దగ్గరకు వెళ్ళాను. ఆయనో వాలు కుర్చీలో కళ్ళు మూసుకుని పడుకుని ఉన్నారు. ఆయన ఎంతగా దాచుకుందామని ప్రయత్నం చేస్తున్నా, వదన దర్పణంలో ఆయన మస్తిష్కం ప్రతిఫలిస్తూనే ఉన్నది.

"మాష్టారూ !"

ఆయన కళ్ళు తెరిచారు.

"ఇట్లా పడుకున్నారేం ఒంటరిగా ? ఏమిటి ఆలోచిస్తున్నారు ?"

ఆయన దగ్గర్నుంచి పేలవమైన నవ్వే నాకు సమాధానంగా ఎదురైంది. ఆ నవ్వుకు అర్థం నాకు తెలిసిందే. జవాబు చెప్పడం ఇష్టంలేనప్పుడు అట్లా నవ్వేసి, అవతలవాడికిక మాట్లాడే అవకాశం లేకుండా చేస్తుంటారాయన. ఆయన జవాబు చెప్పరని లోపల 'పిన్ని' గారి దగ్గరకు వెళ్ళాను. ఆడది కాబట్టి ఆబిడ మొహంలో నీలినీడలు మరింతగా కొట్టవచ్చినట్లు కన్పిస్తున్నాయి

"ఏమైంది పిన్నిగారూ !" విచిత్రం ! పిన్నిగారూ మాట్లాడదు. వీళ్లెవరూ నాకు సమాధానం చెప్పకపోయినా, కనీసం నా విద్యార్థిని, నిన్న మొన్నటి వరకూ 'మాష్టారూ !' అంటూ నా వెన్వెంట తిరిగి తన ప్రతి పిచ్చి ఊహనూ నాకు తెలిపి నన్నో సర్వజ్ఞుడిగా భావించి తన సందేహాలకు సమాధానాలు తెల్సుకున్న కళ్యాణి, కాదు, ఈనాడామె శ్రీమతి కళ్యాణి, తనకు స్త్రీగా మొట్టమొదట జరిగిన ఈ వైవాహిక సత్కార సందర్భంలో నా సందేహానికి సమాధానం చెప్పకుండా ఉంటుందా కాని .... కాని .....

కళ్యాణి తన గదిలో లేదు.

అక్కడ ఉన్న కళ్యాణి స్నేహితురాళ్లలో ఒకామె నామీద దయతలచినట్లుంది. "ప్రొద్దుట్నుంచి కళ్యాణి కన్పించడంలేదు మాష్టారూ !" అన్నది ఆదుర్దాను కంఠంలో దాచుకొందామని ప్రయత్నం చేస్తూ.

నేను తెల్లబోయాను. "కన్పించకపోవడమేమిటి ?"

గబగబా వాకిట్లోకి వచ్చాను.

రాజశేఖరంగారు, తమ వియ్యంకుడితో ఏదో మాట్లాడుతున్నారు. ఆ వియ్యంకుడి మాటలు పెద్దగా వినబడుతున్నాయి. "మా అబ్బాయీ కన్పించడం లేదండీ. ముహూర్తమయ్యాం తర్వాత నాకూ కాస్త మాగన్నుగా నిద్రపట్టింది. లేచి చూసేసరికి, 'అబ్బాయేడండీ' అంటూ మా ఆవిడ నాకు ఎదురు వచ్చింది. మొదట్లో ఇక్కడి కేవన్నా వచ్చాడేమో ననుకున్నాను. ప్యూనును పంపిస్తే ఇక్కడా లేడని తెలిసింది. నేనే వస్తే, కోడలు పిల్లా కనబడ్డం లేదని మరో కొత్త సంగతి."

నాకో సందేహం లీలగా తోచి, వాకిట్లోకి పరుగెత్తాను.

రాజశేఖరంగారి కారు లేదు. కారు డ్రైవరు వో వాస వేసుకుని షెడ్డులో పడుకుని నిద్రపోతున్నాడు.

నా అనుమానం నిర్ధారణమైంది.

వెంటనే మళ్ళీ రాజశేఖరంగారు మాట్లాడుతున్న చోటుకు తిరిగి వచ్చాను. ఆయన నా కళ్లలో వో నిశ్చలతా, నడకలో తొందరపాటూ చూసి, మాటలాపి నావేపు తిరిగి ఏమి టన్నట్లుగా ప్రశ్నార్థకంగా చూశారు.

"మాష్టారూ ! మన మేమీ కంగారుపడనవసరంలేదు. ఇక్కడ అమ్మాయి లేదు. అక్కడ శ్యామసుందరం లేడు. వాకిట్లో మీ కారు లేదు. కలెక్టరుగారూ, కళ్యాణీ ఆలోచించుకుని వో కార్యక్రమం నిర్ణయించుకున్నట్లున్నది."

నా మాటలు విని వియ్యంకు లిద్దరూ వెలతెల బోవడం నేను గమనించాను. ఇహ నేనక్కడ ఉండడం బావుండదని ఈ సంగతి 'పిన్ని' గారితో కూడా చెప్పి వస్తానని లోపలకు వెళ్లాను, వారిని తప్పించుకుని.

అప్పటికే గంట తొమ్మిది కావస్తున్నది.

నామాట విని 'పిన్ని' గారు కొంచెం ధైర్యం తెచ్చుకుని లేచి వంటింట్లోకి వెళ్లింది. కళ్యాణి స్నేహితురాండ్ర కందరికీ ఉబుసుపోకకిది మంచి విషయమైంది. పిల్లలు కొందరు గుక్కపట్టి ఏడుస్తున్నారు.

వంటశాలమీద అజమాయిషీ వహిస్తున్న వో పూర్వ సువాసిని అక్కడకు వస్తే "పోనీ బాలలకంతి కానీ కూడదు మామ్మగారూ !" అన్నాను.

ఆవిడ ఆ ప్రయత్నంలో నిమగ్నమైంది.

ఒక చెంపన పిల్లలు భోజనా లవుతూండగానే "వాళ్లు వచ్చేసరికి అందరం స్నానాలు చేసి కూచుంటే ఆతర్వాత ఇహ ఆలస్యం లేకుండా భోజనాలేర్పాటు కానీయచ్చుకదూ" అన్నాను. కొందరికి నా సలహా నచ్చి అంగవస్త్రాలు కట్టుకున్నారు.

సూర్యుడు చీకటిని మేసిన ఆకలి చాలక, నడిపొద్దు త్వర త్వరగా చేరుకుంటున్నాడు. అందరం నవదంపతుల కోసం ఎదురుచూస్తూ కూచున్నాము

దూరంగా కారు వస్తున్న జాడ. దగ్గరగా కారు శబ్దం.

కారు స్టీరింగు ముందు కలెక్టరుగారే ఉన్నారు. ఆయన ప్రక్కన అందంగా కళ్యాణి, గర్వంగా, సంతోషంగా—

కారు ఆగింతర్వాత, తలుపు తీసి ఒక చేత్తో పట్టుకుని, రెండవచేత్తో కళ్యాణి చేతి నంది పుచ్చుకుని, జాగ్రత్తగా దిగమని చెప్తున్నాడు శ్యామసుందరం.

వరండాలో కూచున్న వయసు దాటిన వియ్యంకు లిద్దరూ చోద్యం చూస్తున్నారు. ఆడంగు లందరూ అబ్బుర పడుతున్నారు. పిల్లలు గొడవ చేయడం మర్చిపోయారు.

శ్యామసుందరం, కళ్యాణి చిటికెనవ్రేలిని సుతారంగా అంది పుచ్చుకుని, వయసు వయసూ నడిచివచ్చినట్లుగా లోనికి నడిచివచ్చాడు. అంతసేపు వాళ్లను చూసింతర్వాతగాని తేరుకోలేదు బాలాదివృద్ధులు.

"ఎక్కడికి వెళ్లావబ్బాయ్" అన్నారు శ్యామసుందరంగారి తండ్రి.

శ్యామసుందరం ఆగాడు. అతనితో కళ్యాణి ఆగింది.

"చెప్పు కళ్యాణీ !" శ్యామసుందరం కళ్యాణి వేపు చూశాడు.

"ఒక పూటకూళ్లామె యింటికి వెళ్లాం" కళ్యాణిలో చిలిపితనం వెక్కిరిస్తున్నది.

"అదేమిటి ?" ఈసారి ఆశ్చర్యపోవడం వధువు తండ్రి దయింది.

"వెళ్లడమే కాదు, భోజనం కూడా చేసి వచ్చాం" శ్యామసుందరం అందుకున్నాడు.

ఈసారి వరుడి తల్లి చకితురాలు కావలసి వచ్చింది. "అదేమిటి నాయనా?" అని మాత్రం అనగల్గింది.

"అమ్మా !" శ్యామసుందరం గొంతులో ఎంతటి ఆర్ద్రత ఉన్నది.

"జ్ఞాపకం ఉందా అమ్మా ! పదిహేను సంవత్సరాల క్రితం నాన్నగారీ వూళ్లో ఉద్యోగం చేశారు."

"అవునవును. అప్పుడీ వూరు కాలేజీలో నువ్వు ఇంటర్మీడియేట్ చదివావు కూడాను" శ్యామసుందరం తండ్రిగారు ఏదో జ్ఞాపకం తెచ్చుకొంటూ జవాబిచ్చారు.

"అవును. అప్పుడే నాకో స్నేహితుడు కూడా ఉండేవాడు. పేరు వామనరావు. నిజంగా వామనుడే. అయినా వాడంటే నాకు ప్రాణాధికమైన ఇష్టంగా ఉండేది. వాళ్ళ యింటికి నేను ఎప్పుడు వెళ్లినా సరే, వాళ్లమ్మ — అప్పటికే ఆమెకు వో పూటకూళ్ల హోటలుంది—అదే ఆమె జీవనాధారం. ఏదో ఒకటి నాకు పెట్టకుండా పంపించేది కాదు. నన్ను చూడగానే మొహమంతా సంతోషం చేసుకునేది. ఇహ వాడు సరేసరి."

"ఏదీ—అతను నీ పెళ్లికి వచ్చినట్లు లేదు."



## వ్యక్తిత్వం

"రాలేదు ఆ సంగతి కనుక్కుందామనే నిన్న సాయంత్రం ప్యూనును పంపించాను" శ్యామసుందరం కంఠస్వరం బరువుగా ధ్వనించింది. "వాడు పోయాడట. వాడు పోయిన దుఃఖంలో, అవును మరి, వాడొక్కడే ఆమెకు సంతానం. ఆమె మంచం పట్టిందట. అంత దుఃఖంలోనూ నా పెళ్లివార్త విని ఎంతో ఆనందించి "ఏమయ్యా! చూస్తున్నావుగా. లేవలేని స్థితి, వాడితో 'దంపతు లిద్దర్నీ పసుపు బట్టల్లో చూడాలని ఉంది అని చెప్పావ్?' అన్నదట. అందుకని—"

"కళ్యాణిని తీసుకుని మీరు వెళ్లారు." రాజశేఖరంగారు నిష్ఠూరంగా అన్నారు.

శ్యామసుందరం ఆయనవేపు ఒకటి రెండు క్షణాలు నిశ్చలంగా చూశాడు.

"మామగారూ! మీరో సంగతి మర్చిపోయినారు. గత అర్ధరాత్రి పన్నెండు గంటల నుంచీ కళ్యాణి, శ్రీమతి కళ్యాణీ శ్యామసుందరమైంది. ఇహనుంచీ ఆమె బరువు బాధ్యతలు నావి" అన్నాడు. అని "మీరు వెళ్లి భోంచేయండి నాన్నగారూ!" అంటూ "కళ్యాణీ! నువ్వు కూడా లోపలికి వెళ్లి అందరికీ ఏం కావాలో చూడు" అంటూ తన గదిలోకి వెళ్లిపోయాడు

రాజశేఖరంగారికి సంతోషమూ, సంభ్రమమూ రెండు కళ్లలోనూ ప్రతిఫలిస్తుండడం నేను గమనించాను.

శ్యామసుందరం వ్యక్తిత్వం నన్ను ముగ్ధుణ్ణి చేస్తుంది "అందరి మామగార్లకూ అటువంటి అల్లుళ్లే లభిస్తే...."

"నాన్నా! నిన్నూ మడిగట్టుకోమంటుంది పిన్నిగారు." అంటూ పన్నెండేళ్లు దాటుతున్న మంజుల వచ్చి నన్ను పిలుస్తున్నది.

నేను మంజుల వేపే చూస్తున్నాను. ★


ఊపిరి
తిరగనీయకుండా
బాధించే పొడి
దగ్గుకు

త్వరితమైన, నిశ్చయమైన గృహస్థ నివారిణి
Alembic గ్లైకోడిన్
టెర్పు వసాకా



GTV-733

ORIGINAL
Racek
REGD



హై పవర్
లాంతరులు
350 కాండిల్ పవరు

ఈ రంగంలో
దీనికి
ఒక దానికే

IS 1384
ISI
స్టాండర్డ్ మార్కు
వున్నది

రాసెక్ ఇండస్ట్రీస్ ప్రయివేట్ లి
శ్రీజి భవన్ లోహార్ స్ట్రీట్ బొంబాయి 2

ఆరోగ్యంతో
కళకళలాడే
చిన్నారిపాపలు



ప్లానిటాబ్ కు కృతజ్ఞులము

PLANITAB
OVULES

నమ్మకము * సులభము * తక్కువ ఖర్చు
మీ డాక్టరును లేక
ఎఫ్. ఎ. క్లినిక్‌లను సంప్రదించండి!

HIND CHEMICALS LTD, KANPUR